

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు




పరిగిలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

ఎదులాబాద్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో పూజలు

తొలి ఏకాదశి పండుగను ఆదివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే గుళ్లకు జనం పోటెత్తారు. స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు దేవీమాతకు వొడి బియ్యం పోశారు. ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. కొందరు పొద్దంతా ఉపవాస దీక్షలు చేశారు. సాయంత్రం ఆలయాల్లో పూజల అనంతరం ఉపవాస దీక్ష విరమించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

దట్టీలు కట్టి.. దండాలు పెట్టి


కొడంగల్ : హస్నాబాద్‌లో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఆదివారం మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పీర్ల ఊరేగింపులో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. పీర్లకు ఊదు, బెల్లం సమర్పించారు. దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల నిర్వాహకులు బెల్లం, బత్తీసల ప్రసాదాన్ని ప్రజలకు పంచారు. డప్పు చప్పుళ్ల మధ్య యువకులు ఆడుతూ పాడుతూ పీర్లను ఊరేగించారు. వాటిని రాత్రి చెరువుకుంటల్లో నిమజ్జనం చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

యువజన సంఘం సేవలు గొప్పవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, పాల్గొన్న సుధీర్‌రెడ్డి, వజ్రేశ్

ఘట్‌కేసర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో లాల్‌బహదూర్ యువజన సంఘం పురాతనమైందని, ఇందులోంచి అనేక మంది నాయకులుగా ఎదిగారని, ప్రజలకు గొప్ప సేవలందించారని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని యువజన సంఘం నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. నాడు యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల్లో పని చేసిన వారు రాజకీయాలు, ప్రజా సేవల్లో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. ఘట్‌కేసర్‌లోని ఈ సంఘంలో పనిచేసిన వారు అనేక మంది ఘట్‌కేసర్‌లో ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవలందించారని మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సంఘం సభ్యులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్, సొసైటీ చైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీలు బండారి దాసు, శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

విరిగిన చోట కొత్త స్తంభం ఏర్పాటు

ఘట్‌కేసర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎఫ్‌సీనగర్ కాలనీ బీ-2లో విద్యుత్ స్తంభం పైభాగం విరిగిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఈ నెల 2న 'విరిగిన విద్యుత్ స్తంభంతో.. పొంచి ఉన్న ముప్పు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని పాతారు. ఏఈ యశ్వంత్ అదే రోజు విరిగిన పోల్‌ను పరిశీలించారు. మూడు రోజుల్లోనే కొత్త కొత్తపోల్ ఏర్పాటుచేయించారు. విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కొత్త స్తంభాన్ని పాతుతున్న సిబ్బంది

'స్థానిక' పోరుకు

సమాయత్తం

జెడ్పీటీసీ స్థానాలు	20	పోలింగ్ కేంద్రాలు	1,288
ఎంపీటీసీ స్థానాలు	229		

సెప్టెంబరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు?

కొన్ని నెలలుగా రాజకీయ పార్టీల నాయకులు, ఔత్సాహికులు ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. సెప్టెంబరు నెలాఖరులోగా ఎన్నికలు పూర్తిచేయాలని హైకోర్టు బెంచ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడంతో ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించారు. పాలకులు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో **20 జెడ్పీటీసీ స్థానాలు, 229 ఎంపీటీసీ స్థానాలు, 594** గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా పార్టీ అభ్యర్థుల గెలుపును జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కాంగ్రెస్ పెద్దలు ఆదేశించారు.




క్షేత్రస్థాయిల్లో పట్టు నిలుపుకునేందుకు పార్టీల వ్యూహం

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న పాలక కాంగ్రెస్

సత్తా చాటేందుకు బీఆర్ఎస్ పాట్లు

గ్రామాల్లో ఉనికి కోసం బీజేపీ యత్నం

ఎన్నికల నిర్వహణపై మొదలైన అధికారుల కసరత్తు



పంచాయతీలు	594
వార్డు స్థానాలు	5,058
పోలింగ్ కేంద్రాలు	5,058

వికారాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొన్ని నెలలుగా ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ వీడింది. 90 రోజుల్లో ఎన్నికలు పూర్తిచేయాలని హైకోర్టు బెంచ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడంతో సర్కారు ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. మొదట రాజకీయ పార్టీల గుర్తుల(సింబల్)తో పోలింగ్ జరిగే జిల్లా, మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. దీంట్లో భాగంగా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే ఎంపీడీవోల బదిలీలకు చర్యలు తీసుకుంటోంది. వీటిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు జిల్లా నుంచి 11 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. అప్పట్లో బదిలీ అయిన వారు తిరిగి వికారాబాద్ జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అధికారుల వివరాలు పంపించాలని ఆదేశాలు రావడంతో అప్పట్లో ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఎంపీడీవోల్లో ఐదుగురు బదిలీపై వెళ్లేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లాలో జిల్లా ప్రజా పరిషత్తు, 20 ఎంపీపీ పదవులు ఉన్నాయి. మొదట 18మండల పరిషత్‌లు ఉండగా, కొత్తగా ఏర్పాటైన రెండు మండలాలతో వాటి సంఖ్య 20కి చేరింది. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు 229కు పెరిగాయి. 20 జెడ్పీటీసీ, 229 ఎంపీటీసీల ఎన్నికల కోసం 1,288 పోలింగ్

మిగతా 8వ పేజీలో...

ఓటర్ల వివరాలు

పురుషులు	3,32,038
మహిళలు	3,39,885
ఇతరులు	17
మొత్తం	6,71,940

కాగ్నా నుంచి అక్రమంగా ఇసుక రవాణా

» పట్టించుకోని రెవెన్యూ, మైన్స్ శాఖల అధికారులు



తాండూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం గోనూరు, వీరశెట్టిపల్లి గ్రామాల మధ్య కాగ్నా నది నుంచి అక్రమార్కులు రాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన మైన్స్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. గోనూరుకు చెందిన మూడు ట్రాక్టర్లు, వీరశెట్టిపల్లికి చెందిన మూడు ట్రాక్టర్లతో నిత్యం ఇసుక తలిరస్తున్నారు. అక్రమార్కులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. గోనూరుకు చెందిన అధికార పార్టీ నాయకుడి ప్రోద్బలంతోనే ఈ దందా సాగుతోందని గ్రామస్తులు అంటున్నారు. ఇసుకను బషీరాబాద్ మండల పరిధి గ్రామాలు, అంగడిరాయిచూర్, రుద్రారం ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక తోడేస్తూ పక్కదారి పట్టిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ, మైన్స్ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టం జిల్లా కార్యదర్శిగా మహేందర్



మోమిన్‌పేట్,జూలై 6 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం జిల్లా కార్యదర్శిగా గుజ్జరి మహేందర్ ఎన్నికయ్యారు. జాతీయ అధ్యక్షుడు చంటి ఆధ్వర్యంలో ఆయనను ఎన్నుకున్నారు. మహేందర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడ అవినీతి జరిగినా బయటకు తీసి ప్రజలకు మేలు జరిగేలా కృషిచేస్తానన్నారు. చంటి, స్రవంతి, వెంకటేశంలకు ధన్యవాదాలు తెలిపారు.


ప్రాజెక్టులో బోటింగ్ కోసం ఏర్పాట్లు

ప్రాణాలు తీస్తున్న అక్రమ రిసార్టులు

అధికారుల చర్యలు శూన్యం .. పర్యాటకులు చనిపోతున్నా పట్టించుకోని వైనం

వికారాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్: వికారాబాద్ పరిసరాల్లో పలు రిసార్టులు అక్రమంగా కొనసాగుతున్నాయి. పర్యాటకుల ప్రాణాలపై వారు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. రిసార్టులపై చర్యలకు అధికారులు వెనకాడుతున్నారు. రాజకీయ అండదండలు, ముడుపులతో వాటిని నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వికారాబాద్ ప్రాంతం హైదరాబాద్‌కు చేరువలో ఉండడంతో అనంతగిరి కొండలకు పర్యాటకులు భారీగా వస్తుంటారు. ఇక్కడ పది వరకు రిసార్ట్‌లున్నాయి. ఐదు సర్పన్‌పల్లి ప్రాజెక్టు సమీపంలో నెలకొన్నాయి. క్యాంప్‌ఫైర్, స్విమ్మింగ్, ట్రెక్కింగ్ తదితర ఈవెంట్లను నిర్వహిస్తున్నారు. గత శనివారం వికారాబాద్ మండలం గోధుమగూడ సమీప 'ది వైల్డర్‌నెస్' రిసార్ట్ పడవ చెరువులో

మిగతా 8వ పేజీలో...

సాగునీటి కోసం నిర్మించిన సర్పన్‌పల్లి ప్రాజెక్ట్‌లోనే 'ది వైల్డర్‌నెస్' రిసార్ట్‌ను నిర్మించారు. చెరువు శిఖాన్ని ఆక్రమించారు. కాలం చెల్లిన బోట్లను వినియోగిస్తున్నారు. పర్యాటకులకు

అడిగితే దౌర్జన్యమే!

హుంక్కా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదేమని ప్రశ్నించే వారిపై రిసార్ట్ సిబ్బంది అమెరికన్ కుక్కలను ఉసిగొల్పుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలో వికారాబాద్ తహసీల్దార్‌గా పని చేసిన రవీందర్ అక్రమ నిర్మాణాలను కూల్చగా వారం రోజుల్లోనే ఆయనను బదిలీ చేయించారు. దీంతో ఆ రిసార్ట్ వైపు అధికారులు సైతం కన్నెత్తి చూడడం లేదు. సేఫ్టీ జాకెట్లు లేకుండానే బోటింగ్ వెళ్లి ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయిన ఘటనతోనైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.


సర్పన్‌పల్లి ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

పర్యాటకుల మృతి ఘటనపై ఎంపీ ఆగ్రహం 8

కుల వృత్తులు నిర్వీర్యం

» మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


గీత కార్మికుల ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తాటిచెట్లను ఇష్టారాజ్యంగా నరికి కల్లుగీత కార్మికులను నష్టానికి గురిచేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కుల వృత్తులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కొర్రెములలోని సర్వే నంబర్లు 311, 312, 313, 324, 326లలో 12 ఎకరాల్లో వెంచర్ చేస్తూ 83 తాటిచెట్లు, 2 ఈత చెట్లను నరికేశారని ఆదివారం కొర్రెములలో గీత కార్మికులు ధర్నా నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ హాజరై వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందేళ్ల నాటి చెట్లను నరికి కార్మికుల ఉపాధిపై దెబ్బ కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి ఈ విషయంపై స్పష్టతివ్వకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం అధ్యక్షుడు దర్శన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, పాండుగౌడ్, అంజనేయులుగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, బి.రాములుగౌడ్, అనిల్‌గౌడ్, బాబురావు పాల్గొన్నారు.

అనుమతితోనే చెట్ల నరికివేత

ఎక్సైజ్ అధికారుల అనుమతితోనే వెంచర్‌లోని 83 తాటిచెట్లను నరికించామని, ఇందుకు ప్రభుత్వానికి రూ.82వేలు చెల్లించినట్టు వెంచర్ నిర్వాహకులు రవి, కిషన్ తెలిపారు. నరికి వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటుతామని చెప్పారు. తమ వెంచర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.



రియల్టర్ కబ్జాలో అటవీ భూమి?

సరిహద్దు స్థలం ఆక్రమించారని అల్లాపూర్ రైతుల ఆరోపణ 6

కుక్కలకు వ్యాక్సిన్లు తప్పక వేయించాలి

» వికారాబాద్‌లో జునోసిస్ డే

» శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఆదివారం వికారాబాద్ ఏరియా పశువైద్యశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి హాజరై జునోసిస్ డేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కాలంలో కుక్కలు చాలా ఇళ్లలో కుటుంబ సభ్యుల్లా మారిపోయాయని, వాటికి క్రమం తప్పక అవసరమైన వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. ఏరియా వెటర్నరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో 36 కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. వీటిల్లో పోలీసుశాఖ కుక్కలు కూడా ఉన్నాయి. వెటర్నరీ ఆస్పత్రి ఏడీ కె.పూర్ణచంద్రరావును డీఎస్పీ అభినందించారు. డాక్టర్ పరమేశ్, మహేశ్, జగన్‌లు పాల్గొన్నారు.

బోటింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్: సర్పన్‌పల్లి ప్రాజెక్టులో అక్రమంగా నిర్వహిస్తున్న బోటింగ్ కేంద్రాలను సీజ్ చేయాలని, నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత డిమాండ్ చేశారు. ఇద్దరు మహిళలు చనిపోయిన సంఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణం అన్నారు. బోటింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులు, అధికారుల అండతో ప్రాజెక్టులన్నీ బోటింగ్ కేంద్రాలుగా మారుతున్నాయని ఆరోపించారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసరాల్లోని అక్రమ రిసార్టులన్నింటినీ సీజ్ చేయాలనిడిమాండ్ చేశారు.

సీసీఐలో కార్మికుడికి గాయాలు

తాండూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ గ్రామ శివారులోని కేంద్ర ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడి చేతికి ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి తాండూరు మండలం కరన్‌కోట్ సీసీఐ(సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో జరిగింది. కరన్‌కోట్ గ్రామానికి చెందిన కట్టు రాంచందర్ కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంలోని లైమ్ స్టోన్ క్రషర్ విభాగంలో క్లీనింగ్ లేబర్‌గా పనిచేసున్నాడు. స్టోన్ క్రషర్‌లో శనివారం రాత్రి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ చెయ్యి క్రషర్ బైన్‌కు తగిలి ఇరుక్కుపోయింది. తోటి కార్మికులు గమనించి క్రషర్ బెల్టును ఆపి రాంచందర్ చేతులను బయటికి తీశారు. అప్పటికే ఆయన చెయ్యి నుజ్జు నుజ్జయింది. వెంటనే యాజమాన్యం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రికి అర్ధరాత్రి తరలించారు. అక్కడి వైద్యులు ఆదివారం హైదరాబాద్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు.











రియల్టర్ కబ్జాలో అటవీ భూమి?

ధారూరు, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపూర్ శివారు పొతుల వాగు వద్ద భూమిని కొనుగోలు చేసిన రియల్టర్ చుట్టు పక్కల ఉన్న అటవీభూమిని ఆక్రమించుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో అటవీశాఖ అధీనంలో ఉన్న ప్రాంతం రియల్టర్ ఆధీనంలో ఉన్నట్లు వారు చెబుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అటవీశాఖ అధికారులు అటవీ హద్దురాళ్ల పాతడంలో అవకతవకలకు పాల్పడటంతో అటవీభూమి అన్యాక్రాంతమైందని రైతులు అంటున్నారు. కాగా అల్లాపూర్ శివారులో కొంతమంది రైతుల భూములను నల్గొండ ప్రాంతానికి చెందిన ఓ రియల్టర్ 41ఎకరాలు కొనుగోలు చేశాడు. రెవెన్యూ రికార్డు ప్రకారం పట్టాదారుల వద్ద భూములను కొనుగోలు చేసిన రియల్టర్ అంతకన్నా ఎక్కువ భూమిని ఆక్రమించుకున్నట్లు చుట్టుపక్కల రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ పరిధిలోని వాగుతో పాటు అటవీ ఆధీనంలో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌ను రియల్టర్ ధ్వంసం చేసి ఆక్రమించినట్లు నీటిపారుదల శాఖ అధికారుల విచారణలో గుర్తించారు. రియల్టర్ కొనుగోలు చేసిన భూమిపక్కనే అల్లాపూర్ అటవీ బ్లాక్‌లో సర్వే నంబరు 11లో 107 ఎకరాలు, 110 సర్వే నంబరులో 41.15ఎకరాలు, 234లో 489.3 ఎకరాలు, సర్వేనంబరు 230లో 217.34 ఎకరాలు అటవీభూమి ఉన్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. కాగా ఈ అటవీభూమికి అనుకుని ఉన్న భూమిని రియల్టర్ కొనుగోలు చేసి చదును చేశాడు. రియల్టర్ కొనుగోలు చేసిన భూమిలో అటవీ భూమి ఉందని చుట్టు పక్కల రైతులు చెబుతున్నారు. కాగా గతంలో ఇక్కడ పనిచేసిన అటవీ అధికారులు ఫారెస్టు మ్యాపు ప్రకారం హద్దురాళ్లు పాతకుండ అవకతవకలకు పాల్పడటంతో ఫారెస్టు భూమి ఆక్రమణకు గురైందని వారు అంటున్నారు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తే రియల్టర్ ఆక్రమించుకున్న అటవీ భూమి లెక్క తేలుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.


అక్రమణలో ఉన్న అటవీ భూమి

జాయింట్ సర్వేకు డీఎఫ్‌వోకు నివేదించాం



సర్వే నంబరు 11లో రెవెన్యూ, అటవీశాఖ జాయింట్ సర్వే కోసం డీఎఫ్‌వోకు నివేదించాం. సర్వే చేస్తేనే రియల్టర్ ఆక్రమించిన అటవీ భూమి లెక్క తేలుతుంది. ఈ సర్వే నంబరులో 107ఎకరాల అటవీ భూమితో పాటు, 22 ఎకరాలు రెవెన్యూ భూమి ఉంది. గతంలో పాతిన హద్దుల ప్రకారం కందకాల చుట్టూ రియల్టర్ కొంత ప్రాంతాన్ని చెరిపినట్లు గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నాం. జాయింట్ సర్వేలో అటవీ భూమి కబ్జాకు గురైనట్లు తేలితే విడిపించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- రాజేందర్, ధారూరు ఫారెస్టు రేంజర్

ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణం

పరిగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు నిర్వహించారు. పరిగి పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో సిద్ధాంతి పార్థసారథి, మార్కెట్ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ఎ.కృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, గోపాల్ పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు


అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు

వికారాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని రైల్వేస్టేషన్ ఎదుటగల అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహం కుడిచేతిని అర్ధరాత్రి సమయంలో విరగొట్టారు. విషయం తెలుసుకున్న పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అంబేడ్కర్ వాదులు ఘటనాస్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం నిరసన వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించాలన్నారు. వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, సుధాకర్‌రెడ్డి, ఆనంద్, సత్యనారాయణ, కొత్తగడి రమేష్, తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడిని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ఖండించారు.

ఘటనపై స్పీకర్ ఆరా

రైల్వే స్టేషన్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం సంఘటనపై తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆరా తీశారు. ఆదివారం ఎస్పీ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహానికి తక్షణమే మరమ్మతులు చేసి యథాస్థితికి తీసుకురావాలని సూచించారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం తెలుసుకుని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు.






ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులతో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కేంద్ర పథకాల పేరు మారుస్తున్న రాష్ట్రం

● చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలనే రాష్ట్రప్రభుత్వం పేరుమార్చిఅమలు చేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరులోని బసవేశ్వరనగర్‌లో ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర పథకాలను ఇందిరమ్మ సౌరగిరి(సోలార్)తెలంగాణ, ఇందిరమ్మ క్యాంటీన్ల పేరిట అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 200 గ్రామాల్లో రూ.12కోట్లతో సీసీరోడ్లు వేశామని తెలిపారు. 150 పాఠశాలల్లో తమ ఫౌండేషన్ ద్వారా మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తున్నట్టు చెప్పారు. జిల్లాఅధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, లలిత, శ్రీలత, మల్లేశం, శాంత్ కుమార్, సాయిరెడ్డి, ఆంజనేయులు, భద్రేశ్వర్, కృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

వికారాబాద్/దోమ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని ఎన్కెపల్లి సమీపంలో ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. సదానందరెడ్డి,రమేష్‌కుమార్, ఈశ్వరప్ప, పెద్దింటినవీన్, వడ్ల నందు, శంకరస్వామి, యాదగిరి శంకర్, కార్తీక్, మోహన్‌రెడ్డి, ఆశిరెడి పాల్గొన్నారు. అలాగే దోమ మండల కేంద్రంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డిని బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కరణం ప్రహ్లాద్‌రావు, వెన్న ఈశ్వరప్ప, గణపూరం వెంకటయ్యగౌడ్, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, రమేశ్, యాదయ్య, పాల్గొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం దరిద్రంగా మారింది

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ప్రస్తుతం ప్రభుత్వం దరిద్రంగా మారిందని, దేవాలయాలపై తరుచూ దాడులు జరుగుతున్నాయని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఐటీఐ కళాశాల హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఇప్పటి వరకు 20, 30 ప్రాంత్రాల్లో ఇలాంటి సంఘటనలు జరిగాయన్నారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం దరిద్రంగా మారి హిందూ దేవుళ్ల వెంట పడుతున్నారన్నారు. హనుమాన్ విగ్రహాన్ని, అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది ఎవరూ ఎందుకనే వివరాలు తెలుసుకోవాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

తాండూరు: నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తున్నదని అన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బొంరాస్‌పేట్, జూలై6 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని ఏనమీదితండా అనుబంధ గ్రామం సోమ్లానాయక్ తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రెడ్డి, భీమ్‌రావు, మహేందర్, ప్రవీణ్, చందు, మోహన్, చిన్నయ్య, లక్ష్మయ్య, మైమూద్, బాల్‌రాజ్, వడ్ల ప్రసాద్ పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రేబిస్ వ్యాధిపై అవగాహన ఉండాలి

షాద్‌నగర్ అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు ఇప్పిస్తూ, వాటికి సోకే ప్రాణాంతకమైన రేబిస్ వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పశు సంవర్థక ఆసుపత్రిలో ఆదివారం పశు సంవర్థకశాఖ, యానిమల్స్ కేర్ సొసైటీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జూనోసిస్ డేను పురష్కరించుకొని కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లారిముద్దుగా పెంచుకునే కుక్కలకు వ్యాక్సిన్‌ను ఇప్పించకపోతే రేబిస్ వచ్చే అవకాశం ఉందని గుర్తుచేశారు. ప్రతీయేటా విధిగా కుక్కలకు, పిల్లులకు వ్యాక్సిన్లు ఇప్పించి, రేబిస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రపంచ జూనోసిస్ డేను పురష్కరించుకొని కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇస్తున్నామని పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇళ్లలో పెంచుకుంటున్న కుక్కలకు విధిగా వ్యాక్సిన్ ఇప్పించాలని వారు సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు ముక్కంటిరాజ్, వంశీకృష్ణారెడ్డి, వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు



యాచారంలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

యాచారం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఆటోలు, క్రూయిజర్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని యాచారం సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. పలు ఆటోలు, క్రూయిజర్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులుండడం చూసి.. మరోమారు ఎక్కించుకోరాదని డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు అప్పగించరాదని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని తెలిపారు. అతివేగంతో వాహనాలు నడపరాదని కోరారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని సీఐ సూచించారు.



జెండా దిమ్మెకు భూమి పూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దిమ్మె నిర్మాణానికి భూమి పూజ

కడ్తాల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందాయిపల్లిలో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మె నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ, మండలలాధ్యక్షుడు రమేశ్ మాదిగలు పాల్గొన్నారు. అనంతరం నేడు(సోమవారం) నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కృష్ణ పిలుపు నిచ్చారు. మహేశ్, జంగయ్య, ప్రశాంత్, మధు, సైదులు, శ్రీకాంత్, శేఖర్,పవన్, అంజయ్య, శ్రీకాంత్, సంజీవ, రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నేటి తరానికి స్ఫూర్తి అంబేడ్కర్

ఘట్‌కేసర్, జూలై 6 (ఆంధ్రజోతి): నేటితరం యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెలిమినేటి సురేష్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, భరత్, దాసు, రాజేష్, సత్యం, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల్లేక అవస్థలు

మర్పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండలంలోని దామస్తపూర్ తండాలో కొన్నేళ్ల కిందట ఒకే గదితో ప్రాథమిక పాఠశాల నిర్మించారు. అంగన్‌వాడీ నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలో 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆ తండావాసులు పాఠశాల అదనపు గదులు నిర్మించాలని కొన్నేళ్లుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అప్పటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందుకు తోడు తండాలో అంగన్‌వాడీ భవనం లేక పోవడంతో పాఠశాలలోనే అంగన్‌వాడీని కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది, పాఠశాలలో 22 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఉన్న పాఠశాల శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తండాలో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.



దామస్తపూర్ తండా ప్రాథమిక పాఠశాల

భక్తిశ్రద్ధలతో యజ్ఞం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కేశంపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివ సీతారామాంజేయస్వామి ఆలయంలో ఆదివారం చాతురామాస్య యజ్ఞం ప్రారంభించారు. ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలుకొని కార్తీక శుద్ధ ద్వాదశి వరకు నాలుగు నెలలు పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. చాతురామాస్య ప్రారంభోత్సవంలో భాగంగా యజ్ఞం నిర్వహించారు. నాలుగు నెలలు నిర్విరామంగా పూజలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య చారి, ఎద్మ విజయ రెడ్డి, తలసాని ప్రభాకర్‌రెడ్డి, జూలపల్లి అనసూయమ్మ, తలసాని బాల్ రెడ్డి, ఇరువెంటి రాఘవేందర్, నర్సింహ, కడియాల శేఖర్ భక్తులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఆరోగ్యంతో పాటు అందంగా ఉండే విధంగా ఔషధకారిగా ఉపయోగపడే గోరింటాకుతో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు సంబురాలు జరుపుకున్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో ప్రత్యేక రంగ వల్లులు, ఆటపాటలతో ఉల్సాహంగా గోరింటాకు వేడుకను ఉల్సాహంగా జరుపుకున్నారు. ఆషాఢ మాసంలో సహజ సిద్ధమైన గోరింటాకును పెట్టుకోవడం మహిళలకు ఆసక్తితో పాటు ఎంతో శుభప్రదమని మహిళలు గుర్తుచేసుకున్నారు. వేడుకలో మంజుల, భారతమ్మ, ప్రసన్న, ప్రశాంతి, రాధిక, లక్ష్మమ్మ, విజయ, హరిణి, సుగుణ, వృంద తదితరులు పాల్గొన్నారు.

- షాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి)



సీసీ రోడ్డు వేశారు.. నీళ్లు పట్టడం మరిచారు

- ఎన్ఎఫ్‌సీ నగర్‌లో రూ.20లక్షలతో రోడ్డు
- స్థానికులే నీళ్లు పడుతున్న వైనం
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఎన్ఎఫ్‌సీనగర్‌లో నీళ్లులేక ఎండిపోయిన సీసీరోడ్డు



సీసీరోడ్డుకు నీళ్లు పడుతున్న స్థానికులు

ఘట్‌కేసర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన సీసీరోడ్డుకు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నాణ్యత దెబ్బతింటోంది. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో కాలనీలో రూ20లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. గత శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజుల పాటు రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. అయితే సీసీరోడ్డు గట్టిపడేందుకు నీటిని పోయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నీళ్ల పట్టించడంలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈవిషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలిపినా ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పేరుకు సీసీరోడ్డుపై మట్టితో కట్టలు కట్టారు తప్ప ఏరోజూ రోడ్డుపై సరైన విధంగా నీళ్ల ఉంచలేదని ఇలా అయితే రోడ్డు ఎలా గట్టిపడుతుందని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. చేసేది లేక తామే తమ ఇంటి ముందు రోడ్డుకు నీళ్ల పడుతున్నామని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సీసీరోడ్డు నిత్యం తడిగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నీళ్లు పట్టేలా చర్యలు చేపట్టాలి



ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలోని బీ-2లో నిర్మించిన సీసీరోడ్డుకు నీళ్ల పట్టించడంలేదు. ఇలా అయితే రోడ్డు నాణ్యత దెబ్బతింటుంది. కొత్తగా వేసిన రోడ్డుకు నీళ్ల లేక ఎండిపోతుండటంతో చూడలేక మేమే బోరుతో నీళ్ల పట్టిస్తున్నాం. నాప్లాటు ముందు అటుఇటు మరికొంత దూరం వరకు పడుతున్నాను. రోడ్డు మొత్తం పట్టడం నా వల్ల అయ్యే పనికాదు.

ఓర్సు వెంకటేష్, స్థానికుడు, ఎన్ఎఫ్‌సీనగర్

రోడ్డు నాణ్యత దెబ్బతింటోంది



కొత్తగా వేసిన సీసీరోడ్డుకు నిత్యం నీళ్లను పెట్టాలి. కానీ ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డుకు నీళ్లలేక నాణ్యత దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. అధికారులు సీసీరోడ్డును పరిశీలించి మరో వారం రోజులైనా నిత్యం నీళ్ల పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

వెంకట్‌రావు, స్థానికుడు, దత్తాత్రేయ నగర్

పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క ఇల్లూ పంపిణీ చేయలే..

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మంచాల : మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, జయమ్మ

మంచాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదోడికి ఒక్క ఇళ్లు కూడా పంపిణీ జరగలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. మంచాలలో మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డిలతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. నీళ్ల, నిధులు, నియామకాలే లక్ష్యంగా అమరుల త్యాగాలతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుచేసిందని తెలిపారు. కానీ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను అన్నిరంగాల్లో దోపిడీకి గురిచేసిందని దుయ్యబట్టారు. లింగంపల్లి గేటువద్ద ఇళ్ల నిర్మించి ఐదేళ్లు గడిచాయని, ఇళ్ల పంపిణీ ఎందుకు చేపట్టలేదో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చెప్పాలని అన్నారు. ప్రజాసంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఏసీసీఎస్ డైరెక్టర్లు జెనిగె వెంకటేష్‌యాదవ్, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎడమ నరేందర్‌రెడ్డి, కె.శ్రీనివాస్, కావలి శ్రీనివాస్, జయానందం, మూర్తి, సదానందం, గోరె వీరేష్, అయిలయ్య, శ్రీనివాస్, మార సురేష్, వెంకటేష్, బి.కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డిపై విమర్శలు చేస్తే జనం హర్షించరు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి తప్పితే.. 18 నెలల కాలంలో కాంగ్రెస్ చేసిందేమీలేదని, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మెప్పుకోసం కిషన్‌రెడ్డిని తూలనాడితే ప్రజలు హర్షించరనే విషయం గుర్తెరగాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కొందరు కిషన్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని, అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సవాల్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, మాజీ ఎంపీపీ కృపేష్, బీఆర్ఎస్వీ నియజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్‌లు మాట్లాడారు. మంచాల మండలం లింగంపల్లి గేట్ వద్ద 96 డబుల్ బెడ్‌రూం ఇళ్ల బ్లాక్‌ను మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హయాంలో నిర్మించారని శనివారం ఈ ఇళ్లను సందర్శించిన మంచిరెడ్డి తాగునీటి వసతితోపాటు కనీస వసతులు కల్పించాలని లబ్ధిదారులకు కేటాయించాలని అధికార యంత్రాంగాన్ని ఆయన డిమాండ్ చేస్తే.. కొందరు కాంగ్రెస్ నాయకులు ఇదేదో తప్పయినట్లు మాట్లాడారంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశారని, అవి వారి కళ్లకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంగల్‌పల్లి, దండుమైలారం ప్యాక్స్ చైర్మన్లు మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి, బిట్ల వెంకట్‌రెడ్డి, నాయకులు డి.నర్సింహ, భాస్కర్ రెడ్డి, బూడిద నర్సింహారెడ్డి, గోపాల్ తదితరులున్నారు.

గుండెపోటుతో బ్యాంకు మేనేజర్ మృతి



భువన్ మోహన్(ఫైల్)

తాండూరు రూరల్, జూలై 6, (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ భువన్ మోహన్ గుండెపోటుతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కరన్‌కోట్ ఎస్‌బీఐ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న భువన్ మోహన్ శనివారం విధులకు హాజరయ్యారు. అనంతరం సాయంత్రం వేళ విధులు ముగించుకుని బ్యాంకుకు తాళం వేసి ఆదివారం సెలవు కావడంతో హైదరాబాద్‌లోని ఇంటికి వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం తన నివాసంలో ఉండగా భువన్ మోహన్ ఉన్నట్టుండి ఛాతిలో నొప్పి రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బ్యాంకు మేనేజర్ మృతి పట్ల కరన్‌కోట్ గ్రామస్తులు మాజీ ఎంపీపీ శరణుబసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ హేమంత్‌కుమార్, కరన్‌కోట్ సీసీఐ కర్మాగారం ఉద్యోగులు పలువురు, కరన్‌కోట్ సీసీఐ ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టర్ విచారం వ్యక్తం చేశారు.

రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కేశంపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన, విద్య, ఉద్యోగాలు, ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలుపై ఈ నెల 12న కేశంపేటలో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు నీమల రమేష్ కురుమ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం చలో కేశంపేటకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరవుతారని తెలిపారు. బీసీల హక్కుల సాధనే ధ్యేయంగా నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశానికి పెద్ద సంఖ్యలో బీసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఎదిరే వెంకటయ్య, అశోక్, నీమల శ్రీనివాస్, పల్లాటి కృష్ణయ్య, గుత్తి రంగయ్య, తిరుపతయ్య, నక్క గోపాల్ యాదవ్, వెంకటయ్య, వల్కే శ్రీనివాస్, శేఖర్, రాఘవేందర్, సూరమోని లింగస్వామి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

మొయినాబాద్ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు మదాపురం శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలోని కంజర్ల మాల్‌లో హిమాయత్ నగర్ బూత్ అధ్యక్షులు, బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీఒక్కరు పార్టీ ఆదేశాలనుసారం పనిచేయాలని, కష్టపడితే భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని సూచించారు. వ్యక్తిగత నిర్ణయాలతో పార్టీకి నష్టం చేకూర్చవద్దని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలన్నారు. ఓబీసీ సెల్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, నూనె మురళి, జల్లెల రవి, ఎల్గని నవీన్ గౌడ్, బుర్రకాయల రాజు, బి.రాజు, రాజు సాగర్, షాబాద్ కిషన్, కాసుల సురేష్ గౌడ్, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఉత్తమ వైద్యులను సన్మానిస్తున్న క్లబ్ నూతన అధ్యక్షులు శరణు బసప్ప, తదితరులు

తాండూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తాండూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గంతో ఆదివారం లయన్స్‌క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ హరినారాయణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. తాండూరులో ఉత్తమ వైద్యుడు అభిషేక్, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడిగా శరణుబసప్ప, కో-ఆర్డినేటర్‌గా రొంపల్లి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మురళి మోహన్, మహ్మద్ యూసుఫ్, వీర ప్రసాద్, కార్యదర్శిగా మంకాల్ నటరాజ్, సహకార్యదర్శిగా గూళి శివకుమార్, కోశాధికారిగా గౌరిశంకర్, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా ఓంప్రకాష్ సోమాని, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్‌గా పసారం బస్వరాజ్, క్లబ్ అడ్మినిస్ట్రేటివ్‌గా సల్లా దామోదర్, క్లబ్ కో ఆర్డినేటర్‌గా వై.బసనప్ప ప్రమాణ స్వీకారం చేశారు.

నేరాల అదుపునకు సహకరించాలి



ఎస్ఐ రమేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దళిత, అంబేడ్కర్, బహుజన సంఘాల నాయకులు

కులకచర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు అందరూ సహకరించాలని ఎస్ఐ రమేశ్‌కుమార్ అన్నారు. పుట్టపహాడ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను త్వరలోనే గుర్తించి రిమాండ్ చేస్తామన్నారు. పీఎస్ ఆవరణలో ఆదివారం ఎస్ఐ రమేశ్‌కుమార్‌ను దళిత, అంబేడ్కర్, బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఎస్సైను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కేబీ.రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, సత్యహరిశ్చంద్ర, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: పీర్ల వద్ద స్థానికుల ప్రార్థనలు


కొడంగల్‌లో పీర్ల ఊరేగింపు


దుద్యాల: హస్నాబాద్‌లో మొహర్రం వేడుకల్లో అలావ్ ఆడుతున్న మహిళలు


శామీర్‌పేట్: అలియాబాద్‌లో పీర్ల ఊరేగింపు

ఊరూరా మొహర్రం వేడుకలు

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను స్థానిక ముస్లింలు సాయంత్రం వేళల్లో ఊరేగింపు నిర్వహించారు. హసన్, హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటూ ప్రధానవీధుల గుండా నిర్వహించిన ఊరేగింపులో స్థానికులు కుల మతాలకు అతీతంగా పాల్గొన్నారు. భక్తులు పీర్ల మసీదుల్లో ప్రతిష్ఠించిన పీర్ల వద్దకు వచ్చి స్థానికులు దట్టీలను సమర్పించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. పీర్లవద్ద స్థానిక ప్రముఖులు ప్రత్యేకంగా ప్రార్థలను నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 6


మర్రిపల్లిగూడలో పీర్ల ఊరేగింపులో గ్రామస్తులు


ఘట్‌కేసర్: చందుపట్లగూడలో పీర్ల ఊరేగింపు


మోమిన్‌పేట్: టేకులపల్లిలో మొహర్రం వేడుకలకు తరలివచ్చిన గ్రామస్తులు


బషీరాబాద్: మైల్వార్‌లో పీర్ల ఊరేగింపులో గ్రామస్తులు


ధారూరు: కుక్కిందలో పీర్ల ఊరేగింపులో గ్రామస్తులు


మర్పల్లి: అక్నాపూర్‌లో మొహర్రం వేడుకలు

'స్థానిక' పోరుకు సమాయత్తం

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో పంచాయతీల సంఖ్య 594, వార్డులు 5,058 ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల కోసం జిల్లాలో 5,058 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. జిల్లాలో మొత్తం 6,71,940 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. పురుషులు 3,32,038 మంది, మహిళలు 3,39,885, ఇతరులు 17 మంది చొప్పున ఉన్నారు.

రిజర్వేషన్లపైనే అందరి చూపు..!

స్థానిక సంస్థల ఎన్నికలు మరో రెండు నెలల్లో రానుండడంతో అందరి చూపు రిజర్వేషన్లపై పడింది. ప్రధాన పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మంగా తీసుకుంటున్నాయి. అభ్యర్థుల ఎంపిక, బలాలు, బలహీనతలపై దృష్టి సారించనున్నాయి. ఏ స్థానం ఎవరికి రిజర్వు అవుతుందో స్పష్టత లేక నాయకులు, ఆశావహులు తలపట్టుకుంటున్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉన్నారు. స్థానిక పోరును కాంగ్రెస్ పార్టీ నేతలు ఏ విధంగా ఎదుర్కొంటారనేది చర్చనీయాంశంగా మారింది.

అధికార పార్టీకి సవాలే...

జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి



రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు స్థానిక ఎన్నికలు సవాల్‌గా మారనున్నాయి. క్యాడర్‌ను సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గెలిచేందుకు ఎలాంటి వ్యూహరచన చేస్తారనే చర్చసాగుతోంది. స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకోవడం, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకులు ఇది వరకే ఎన్నికలపై దృష్టిసారించడం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. అయితే పార్టీలో వర్గపోరు, అభ్యర్థుల ఎంపిక, టికెట్లు రాని వారి తిరుగుబాట్లు వంటివి పాలకపార్టీ నేతలకు తలనొప్పిగా పరిణమించే అవకాశాలు లేకపోలేదు.

పట్టు సాధించేందుకు బీఆర్ఎస్

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఊహించని పరాభవాన్ని చవిచూసిన బీఆర్ఎస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అయినా మునుపటి సత్తాచాటాలని భావిస్తోంది. అత్యధిక స్థానాల్లో విజయం సాధించి క్షేత్రస్థాయిలో పార్టీ బలంగానే ఉందనే సంకేతాలను పంపించే ప్రయత్నం మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని యోచిస్తున్నారు. ఇదిలా ఉంటే అసెంబ్లీ, లోక్‌సభ వరుస ఎన్నికల్లో ఓడిన నైరాశ్యంలో ఉన్న బీఆర్ఎస్ నాయకుల మధ్య సమన్వయం లోపించిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో వర్గపోరు, కొన్ని మండలాల్లో నాయకులు, కార్యకర్తలు వేరే పార్టీల్లోకి వెళ్లడం వంటివి స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయాలపై ప్రభావం చూపుతుందనే వాదనా విన్పిస్తోంది.

ఉనికి చాటుకోవాలని...

బీజేపీ అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు రాబట్టింది. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఎక్కువ ఓట్లు రావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్ఠపై ప్రచారం చేస్తూ బలమైన అభ్యర్థులను నిలిపి స్థానిక పోరులో సత్తా చాటాలని కమలం నాయకత్వం, శ్రేణులు భావిస్తున్నాయి. అయితే పార్టీ కార్యక్రమాలు పట్టణాలకే పరిమితం కావడం, గ్రామాల్లో పూర్తిస్థాయిలో పార్టీ నిర్మాణం లేకపోవడం, నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు బీజేపీకి ప్రతికూలంగా మారే ఆస్కారం లేకపోలేదు.

ఆశావహుల్లో ఉత్కంఠ...

ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఉండడంతో పాతస్థానాల్లో కొత్తగా ఎవరికి రిజర్వు అవుతుందనేది ఆసక్తి నెలకొంది. జెడ్పీ చైర్‌పర్సన్ మొదలుకొని జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యుల వరకు అన్ని స్థానాల్లో రొటేషన్ విధానం అమలు కానుండడంతో అందరి చూపు రిజర్వేషన్ల ఖరారుపై పడింది. గత ప్రభుత్వం తెచ్చిన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం పదేళ్ల పాటు ఒకే రిజర్వేషన్ అమల్లో ఉండాలి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడంతో రిజర్వేషన్లను మరోసారి సవరించాల్సిన అవసరం ఉంది.

యంత్రాంగం సర్వం సిద్ధం!

ప్రాదేశిక ఎన్నికలపై ఎప్పుడు ప్రకటన వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. రిజర్వేషన్లు మినహా ఇతర అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేసింది. మండల ప్రాదేశిక నియోజకవర్గాలు, ఓటర్ల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి పనులు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించే అధికారులకు, సిబ్బందికి ఇది వరకే రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

10 గంటల పని జీవోను రద్దు చేయాలి

తాండూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న రోజు 8 గంటలు ఉన్న పని విధానాన్ని మారుస్తూ 10గంటలకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 282ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఈనెల 9న జరిగే దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు చంద్రయ్య పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు



వికారాబాద్, జూలై 6, (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ బీజేపీ నాయకుడు, జిల్లా మాజీ అధ్యక్షులు కోకట్ మాధవ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొట్టిగా ఇ.శివరాస్ నేతృత్వంలో బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి. విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు టి. రాజేందర్‌రెడ్డి, కె. వివేకానంద రెడ్డి, సి.రాములు, సీనియర్ నేతలు జి.పాండు గౌడ్, కేవీ.రాజు, మల్లేష్ యాదవ్, బుస్సా శ్రీకాంత్, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, యు. అమర్‌నాథ్, కె.నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్పన్‌పల్లి బాధితులకు కోటి పరిహారం ఇవ్వాలి

తాండూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మండలంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బోటింగ్ నడుపుతున్న రిస్టార్ట్స్‌ను సీజ్‌చేసి నిర్వాహకులపైన క్రిమినల్ కేసులు పెట్టాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బిహార్‌కు చెందిన ఇద్దరు మహిళా పర్యాటకుల ప్రాణాలు బలి తీసుకున్నారని ఆరోపించారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాండూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మంబాపూర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ వికారాబాద్ ఫీడర్‌పై చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున మంబాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏడీ ప్రకటనలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంత మంది ఉదయం నుంచి ఉపవాస దీక్షను చేపట్టి సాయంత్రం విరమించారు. ఆలయాల్లో పీఠాధిపతులు, స్వామీజీలు, ప్రముఖ వక్తలు తొలి ఏకాదశి విశిష్టతను వివరించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 6


ఘట్‌కేసర్: శివారెడ్డిగూడ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు

తాండూరు: పట్టణం పాండురంగస్వామి ఆలయంలో రుక్మిణి విఠల్ స్వామికి ప్రత్యేక పూజలు




మోమిన్‌పేట్: విఠలేశ్వర స్వామి ఆలయంలో ప్రముఖ వక్త డాక్టర్ మల్లారెడ్డి ప్రసంగం


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో పూజలు


కొడంగల్: విష్ణు సహస్ర పారాయణంలో భక్తులు


కులకచర్ల: ఓంకారేశ్వర స్వామి ఆలయం నుంచి మైలారం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర

ప్రాణాలు తీస్తున్న అక్రమ రిసార్టులు

(ఐదో పేజీ తరువాయి)

బోల్తాపడి ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. వారిని కాపాడేందుకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

మూడేళ్ల కిందట గుడుపల్లి సమీపంలో ఉన్న ఓ రిసార్ట్ స్విమ్మింగ్ పూల్‌లో ఓ చిన్నారి పడి మృతిచెందింది. సర్పన్‌పల్లి సమీప రిసార్ట్‌లో ఓ వ్యక్తి బావిలో మునిగి చనిపోయాడు. అంతకు ముందు ఓ రిసార్ట్‌లో కార్‌రేస్ ప్రమాదంలో వ్యక్తి చనిపోయాడు. ఇలా పర్యాటకుల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శ వ్యక్తమవుతున్నాయి. రిసార్టులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అనుమతి లేకున్నా కోరుకున్న మద్యం అందుబాటులో ఉంటోంది. రిసార్టుల నిర్వాహకులు పోలీసు, ఎక్సైజ్, ఇరిగేషన్ శాఖల అధికారులకు ముడుపులు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పర్యాటకుల మృతి ఘటనపై ఎంపీ ఆగ్రహం

వికారాబాద్: సర్పన్‌పల్లి చెరువు బోటింగ్‌లో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పన్‌పల్లిలో అక్రమంగా నడుపుతున్న వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌ను ఆదివారం సందర్శించారు. ప్రమాద కారణాలపై ఆరా తీశారు. ఎంపీ మాట్లాడుతూ.. పర్యాటకంతో స్థానికులకు ఉద్యోగావకాశాలు లభించాలిగానీ ఇలా అనుమతులు లేకుండా రిసార్ట్‌లు, బోటింగ్ నడపడం నేరమన్నారు. ఈత కూడా రానివారితో బోటింగ్ నిర్వహించడమంటే పర్యాటకుల ప్రాణాలతో చెలగాటం ఆడడమేనన్నారు. గతంలో ఈ రిసార్ట్‌పై కలెక్టర్ ఆంక్షలు విధించారు. అయినా అదే యాజమాన్యం బోటింగ్ నిర్వహించడంపై సమగ్ర విచారణ చేయించాలన్నారు. మీడియాల్లో ఈ రిసార్ట్ కార్యకలాపాలపై ఎన్నోసార్లు వార్తలొచ్చాయన్నారు. అయినా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ పాలకులు చేయరని ఆశించామని, కానీ ఇద్దరు మహిళలు చనిపోవడం బాధాకరమన్నారు. ఇందుకు బాధ్యులైన వారికి శిక్షించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి

ఉపప్రధానిగా పని చేసి దేశాభివృద్ధికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివని పలువురు నేతలు అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభివృద్ధికి అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 6


వికారాబాద్: జగ్జీవన్‌రాం విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


పరిగి: బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


చౌడాపూర్: బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిలో ప్రజా సంఘాల నాయకులు


మేడ్చల్ టౌన్: బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కీసర: చీర్యాల్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పలువురు నాయకులు


ఘట్‌కేసర్: బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

క్రైం కార్నర్

వ్యక్తిపై బాలుడి హత్యాయత్నం

బషీరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు గొడవ పడతుండగా ఓ వ్యక్తి అడ్డుకున్నాడని ఆగ్రహించిన బాలుడు సదరు వ్యక్తిపై కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటనలో వ్యక్తి మెడపై తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఏఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్మాయి గ్రామానికి చెందిన అడికి మహేష్(17సంవత్సరాలు) అనే బాలుడు, సుంకరి నవీన్ ఇరువురు స్థానిక చౌరస్తాలో గొడవ పడుతుండగా, అటువైపుగా వెళ్తున్న ఎరుకల మల్లెప్ప గొడవను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో బాలుడు కోపంతో ఊగిపోతూ ఇంటికి పరుగుతీశాడు. ఇంట్లోని కొడవలిని తీసుకుని చౌరస్తా వద్ద ఉన్న ఎరుకల మల్లెప్పపై విరుచుకుపడి మెడపై దాడి చేశాడు. ఈ దాడిలో మెడ పైభాగం తెగి రక్తస్రావం కావడంతో స్పృహతప్పి కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న బాధిత వ్యక్తి కుటుంబీకులు గొడవ జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలం వద్దకు రాగా బాలుడు గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు అనుమనిస్తూ అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని హుటాహుటిన తాండూరు జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధిత వ్యక్తి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని కుటుంబీకులు తెలిపారు. మల్లెప్ప ఫిర్యాదు మేరకు బాలుడిపై హత్యాయత్నం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నారాయణ వెల్లడించారు.

వెంకటాపూర్‌తండాలో అగ్ని ప్రమాదం

వికారాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటాపూర్ తండా సమీపంలోని మద్గుల్‌గడ్డతండాలో నివాసముంటున్న రాము నాయక్ ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లో నిల్వఉంచిన 25క్వింటాళ్ల బియ్యం పూర్తిగా దగ్ధమైంది. అదేవిధంగా నగదు, గృహోపకరణ సామగ్రి తదితర వస్తువులతో కలిపి సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పినట్లు తెలుస్తోంది.

విద్యార్థి అదృశ్యం

చౌడాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మరికల్ గ్రామానికి చెందిన జోగు శ్రీను కుమార్తె జోగు మమత మహబూబ్‌నగర్ గురుకుల రెసిడెన్షియల్‌లో డిగ్రీ చదువుతోంది. శనివారం హాస్టల్‌కు వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా హాస్టల్‌లో లేదు. దీంతో తెలిసిన వారు, బంధువుల దగ్గర వెతికినా ఫలితం లేకపోయింది. ఇంట్లో మమత సర్టిఫికేట్‌లలో ఓ ఉత్తరం కనిపించగా కుటుంబసభ్యులు పరిశీలించగా అందులో తనకు డిగ్రీ చదవడం ఇష్టం లేదని, తాను ఓ ఉద్యోగిని ప్రేమిస్తున్నాని అతడి దగ్గరికి వెళ్తున్నానని రాసి ఉంది. తన గురించి ఆందోళన చెందొద్దని ఉత్తరంలో రాసి ఉంది. దీంతో తండ్రి జోగు శ్రీను తన కుమార్తెను తనకు అప్పగించాలని ఆదివారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

బైక్ దొంగకు రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఇంటిముందు పార్కు చేసిన బైక్‌ను ఎత్తుకెళ్లిన దొంగను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎదులాబాద్‌కు చెందిన పోలు నర్సింగ్‌రావు ఈనెల 4వ తేదీన రాత్రి తన ఇంటిముందు బైక్‌ను పార్కు చేసి ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు అంబర్‌పేట్‌కు చెందిన ఆటోడ్రైవర్ చింతల మహేష్(20) అరెస్టు చేశారు. అతడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి సహకరించిన అతడి స్నేహితుడు రామగళ్ల నిఖిల్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు మహేష్‌ను రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిగి బస్టాండ్‌లో చైన్‌స్నాచింగ్

- 24 గంటల్లోపే ఛేదించిన పోలీసులు

పరిగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో చైన్‌స్నాచింగ్ కేసును పరిగి పోలీసులు 24 గంటల్లోపే ఛేదించారు. దోమ మండల కేంద్రానికి ఈడిగి పద్మమ్మ శనివారం పరిగి బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా ఆమె మెడ నుంచి 16 పట్టీలతో ఉన్న పుస్తెను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకెళ్లాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బస్టాండ్‌లో ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ జరిపి దొంగను గుర్తించామని ఎస్ఐ తెలిపారు. పరిగి మున్సిపాలిటీ పరిధి తుంకులగడ్డకు చెందిన కె.అనంతమ్మ గుర్తించి విచారిస్తే చోరీని ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితురాలి నుంచి 16బంగారుపట్టీలు, పుస్తెను స్వాధీనం చేసుకుని ఆదివారమే రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఇదే నిందితురాలు గత ఏప్రిల్ కొడంగల్ బస్టాండ్‌లోనూ చోరీకి పాల్పడింది.

సంక్షిప్తంగా..

ఘనంగా శ్యామాప్రసాద్‌ముఖర్జి జయంతి వేడుకలు

పరిగి: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఆదివారం పరిగిలోని అమరవీరుల చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెన్నె ఈశ్వరప్పలు, పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కీసర రూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ 14వ వార్డు మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కాలనీలో ఆదివారం ఎస్క్వేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు

కులకచర్ల: అర్హులందరికీ రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు వేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.

పండుగల సాయన్న జయంతి వేడుకలు

పరిగి: తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగల సాయన్నముదిరాజ్ జయంతి వేడుకలు పరిగిలో ఘనంగా జరుపుకున్నారు. పరిగిలోని పండుగల సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పరుశరాంరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ అశోక్, ముదిరాజ్‌మహసభ జాతీయ కార్యదర్శి కె.హన్మంత్ పాల్గొన్నారు.

పరిగి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా దోమ శ్రీశైలం

పరిగి: పరిగి మున్సిపాలిటీ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా 9వ వార్డుకు చెందిన దోమ శ్రీశైలంముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంను ఆదివారం తాలుకా, మండల ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో వేస్తామని కొత్తగా నియమితులైన శ్రీశైలం తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

యాలాల: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని నేడు(సోమవారం) ఘనంగా నిర్వహించుకుందామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మెట్టి సూర్యప్రకాష్, డప్పు మహేందర్ పిలుపునిచ్చారు. యాలాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం వారు మాట్లాడారు.